క్లుప్తంగా

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు



డోర్నకల్: విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ డీఈ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కస్నాతండాలో గురువారం డీఈ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోని విద్యుత్ మోటార్లను పరిశీలించి, విద్యుత్ బకాయిల పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ రమేశ్, కురవి అకౌంట్స్ అధికారి రమేశ్, ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు ఖాయం

తొర్రూరు/కొత్తగూడ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలవడం ఖాయమని పార్టీ జిల్లా కార్యదర్శి కొలుపుల శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పల్లె కుమార్ అన్నారు. బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డి గెలుపు కోరుతూ గురువారం డివిజన్ కేంద్రంలో పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, నాయకులు జలగం రవి, దేవరకొండ విష్ణు, నూకల నవీన్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

సెలవు రోజుగా ప్రకటించాలి

గార్ల/కురవి: ఈనెల 15న సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ప్రభుత్వం అధికారికంగా సెలవు రోజుగా ప్రకటించాలని కోరుతూ గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను లంబాడీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్ కలిసి వినతిపత్రం అందజేశారు.

డాక్టరేట్ ప్రదానం



మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న జిల్లా కేంద్రానికి చెందిన నగేష్ డాక్టరేట్ అందుకున్నాడు. అన్నామలై విశ్వవిద్యాలయం మిషన్ లెర్నింగ్ సహాయంతో టమాటా పంటల పక్వాన్ని వచ్చే వ్యాధులను ముందుగా గుర్తిస్తూ ప్రక్రియ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి



సాక్షి నెట్‌వర్క్: స్వాతంత్య్ర సమర యోధురాలు, రచయిత్రి, కవి సరోజినీనాయుడు జయంతిని పురస్కరించుకొని ఆంగ్లభాష దినోత్సవాన్ని పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. సరోజినీనాయుడును ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఆంగ్లభాషలో పట్టు సాధించాలన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ



మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి ఉన్నతంగా స్థిరపడిన ప్రతీ పూర్వ విద్యార్థి స్పందించి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని వంగ సీతయ్య చారిటబుల్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు అడ్వకేట్ వంగ నాగేశ్వరరావు, మేనేజింగ్ డైరెక్టర్ వంగ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు గురువారం వంగా సీతయ్య జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.45వేల సౌండ్ సిస్టంను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిరినాయక్, ఉపాధ్యాయులు వాసుదేవ్, రవీందర్, శ్రీరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కావాలనే చెత్త కాల్చివేత

మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామ శివారులో గల సేవాలాల్ గుడి ప్రాంగణంలో పెరుకుపోయిన చెత్తను కొందరు వ్యక్తులు గురువారం కాల్చివేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అక్కడకు చేరుకుని కావాలనే కొందరు కాంగ్రెస్ నాయకులు చెత్తను కాల్చివేసి అక్కడ ఉన్న చెట్లను కూడా దగ్ధం చేయాలని చూస్తున్నారన్నారు. ఈ విషయంపై రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీర సురేష్ మాట్లాడుతూ.. సేవాలాల్ జయంతి ఏర్పాట్ల కోసమని చెత్తను కాల్చివేశామే తప్ప కావాలని ఎవరు కూడా కవ్వింపు చర్యలకు పాల్పడలేదని పేర్కొన్నారు.

ఎన్‌హెచ్ అలైన్‌మెంట్ రగడ

మానుకోటలో భూ బాధితుల ఆందోళన బాట

- అలైన్‌మెంట్ మార్చాలని అభ్యర్థన
- పోలీసు బందోబస్తు, అరెస్టుల నడుమ సర్వే
- భూసేకరణ, సర్వే, మార్కింగ్ పనుల్లోనే అధికారులు



సాలార్‌తండా వద్ద ఎన్‌హెచ్ మార్కింగ్ చేస్తున్న రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు

మహబూబాబాద్: జిల్లా మీదుగా మరో జాతీయ రహదారి వెళ్లనుంది. ఈమేరకు కొన్ని సంవత్సరాలుగా సర్వే జరుగుతూనే ఉంది. ఈక్రమంలో భూములు కోల్పోయిన వారు ఆందోళన చేస్తున్నారు. దీంతో భూసేకరణ సర్వే, మార్కింగ్ ఆలస్యమవుతుందని అధికారులు అంటున్నారు. కాగా బాధితులు మాత్రం అలైన్‌మెంట్ మార్చి తమకు న్యాయం చేయాలని ఆందోళన బాట పట్టారు. గురువారం మానుకోట పరిధిలోని సాలార్‌తండా, రజాలిపేట గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈమేరకు పోలీసు బందోబస్తు మధ్య సాలార్ తండా వద్ద ఎట్టకేలకు సర్వే పూర్తి చేశారు. ఈక్రమంలో 30మంది గిరిజనులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

జిల్లాలో 69.8 కిలోమీటర్లు..

వలిగొండ నుంచి భద్రాచలం ఎన్‌హెచ్ వరకు జాతీయ రహదారి–930(పి) మంజూరైంది. 2023 నుంచి సర్వే, భూసేకరణ, మార్కింగ్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. మానుకోట జిల్లాలో 69.8 కిలో మీటర్ల మేరకు జాతీయ రహదారి నిర్మాణం చేయనున్నారు. వలిగొండ నుంచి తొర్రూరు వరకు రహదారి పనులు జరుగుతున్నాయి. కాగా తొర్రూరు,నెల్లికుదురు, మానుకోట బైపాస్ మీదుగా మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు బోరింగ్‌తండా సమీపంలోని గుట్టలు,మెడికల్ కాలేజీ వెనుక నుంచి రజాలిపేట గ్రామ శివారు వెంచర్ మధ్యలో నుంచి నిర్మాణం చేయనున్నారు. అక్కడ నుంచి సాలార్‌తండా, కలెక్టరేట్ వెనుక ప్రాంతం నుంచి మున్సిపాలిటీ భవనం, రైల్వే ట్రాక్ మీదుగా ఇల్లెందు రోడ్డుకు కలపనున్నారు. సబ్‌స్టేషన్ సమీపంలో జంక్షన్ నిర్మాణ చేయనున్నట్లు తెలిపారు.

అప్పుడు.. ఇప్పుడు ఆందోళనలు

రహదారి అలైన్‌మెంట్ మార్చాలని 2023మే నెలలో ఇల్లెందు రోడ్డు బాధితులు సుమారు 100 మంది పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఆందోళన చేసినా ఫలితం లేకపోయింది. కాగా సాలార్‌తండా సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయం పక్క నుంచి నిర్మాణం చేయనున్నారు. సర్వే మార్కింగ్ కోసం కొన్ని నెలలుగా రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు ప్రయత్నాలు చేస్తుండగా.. స్థానికులు అడ్డుకుంటున్నారు. ఎట్టకేలకు గురువారం పోలీసులు సుమారు 30 మందిని ముందస్తు అరెస్ట్ చేసి 28మంది రైతుల ఏడున్నర ఎకరాల భూమిలో సర్వే మార్కింగ్ పూర్తిచేశారు. కాగా తండావాసులు కలెక్టరేట్ విషయంలో తమ తండాకు అన్యాయం చేశారని, మళ్లీ రహదారి పేరుతో అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రజాలిపేట గ్రామానికి చెందిన బాధితులు కూడా ఆందోళన చేస్తున్నారు. ఈక్రమంలో నిర్మాణ పనులు జరుగుతాయో లేదో వేచి చూడాల్సిందే.

టెండర్ దశలోనే..

జిల్లాలో రహదారి పనులు టెండర్ దశలోనే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. సర్వే, మార్కింగ్ చాలా వరకు పూర్తయిందని, అనంతారం గ్రామం వద్ద మాత్రమే సర్వే మార్కింగ్ మిగిలి ఉందని అంటున్నారు. 150 ఫీట్ల రోడ్డు తప్పనిసరిగా ఉంటుందన్నారు. నష్టపరిహారం ఇతరత్రా ప్రక్రియ పూర్తి కాగానే ఆన్‌లైన్ టెండర్ పూర్తి అవుతుందని తెలిపారు. నెల్లికుదురు నుంచి కొత్తగూడెం మీదుగా ఎన్‌హెచ్ 30కి కలుపుతారు.

కాంగ్రెస్‌ను ప్రజలు ఓడించడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



మాట్లాడుతున్న రెడ్యానాయక్

కురవి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటిన ఇంత వరకు హామీలు అమలు చేయలేదని, ఎప్పుడు ఎన్నికలు వచ్చిన కాంగ్రెస్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు తోటలాలయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అడిగినా అడగకున్నా అన్ని పథకాలు అమలు చేసి ఇచ్చామన్నారు. తాను ప్రారంభించిన బలపాల ఆస్పత్రిని ఇప్పుడు గెలిచిన ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సైతం మంజూరు లేకుండా సమీకృత గురుకులానికి శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి సంఘటన చూడలేదని విమర్శించారు. ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ రూ.2వందల కోట్లు తెచ్చిండట.. ఎక్కడ పెట్టాడో నని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోత్ రవినాయక్, రాంచంద్రయ్య, గోవర్ధన్‌రెడ్డి, నరహరి, నెహ్రూ, గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

అమ్మవార్లకు మొక్కుల చెల్లింపు



డోర్నకల్: గన్యాతండాలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



గూడూరు: చింతలగట్టులో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

డోర్నకల్: మండలంలోని కస్నాతండా శివారు గన్యాతండా సమ్మక్క–సారలమ్మ తల్లి ఆలయంలో గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు తల్లులకు పూజలు నిర్వహించారు. అడవి నుంచి సమ్మక్కను తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు.

జనసంద్రంలో చింతలగట్టు జాతర

గూడూరు: మండలంలోని దామరవంచ, జగన్నాయకులగూడెం శివారు జాతీయ రహదారి పక్కన చింతలగట్టు వట్టివాగు ఒడ్డున వెలసిన శ్రీ సమ్మక్క–సారలమ్మ మినీ జాతర గురువారం జన సంద్రంతో నిండుకుంది. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే మురళీనాయక్, ఉమ దంపతులు, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న అహ్మద్ ఖాన్

మహబూబాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసి న్యాయం చేయాలని ఉద్యమకారులు అహ్మద్‌ఖాన్, నీలేష్‌రామ్, దార్ల శివరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు న్యాయం చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గత ఎన్నికల్లో మద్దతుగా నిలిచినట్లు తెలిపారు. ఉద్యమకారుల పరిస్థితిని అర్థం చేసుకొని సీఎం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రామకృష్ణ, ఖయ్యూం, అశోక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మించాలి

తొర్రూరు: వంద పడకల ఆస్పత్రిని నిర్మించి అందుబాటులోకి తేవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలో వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఏరియా ఆస్పత్రిని కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి అందుబాటులోకి తీసుకురాకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు కొత్తపల్లి రవి, బొల్లం అశోక్, ఓమ భిక్షపతి, వీరన్న పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గార్ల: అలిగేరు వాగు నుంచి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాకర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రియాజ్‌పాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సంతూలాల్‌పోడు తండాకు చెందిన తేజావత్ శ్రీను గ్రామ సమీపంలోని అలిగేరు నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. మండలంలోని సత్యనారాయణపురం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. ట్రాక్టర్‌ను సీజ్‌చేసి, శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మరిపెడ రూరల్‌లో..

మరిపెడ రూరల్: మండలంలోని బాల్నిధర్మారం, సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం బిక్కుమళ్లకు చెందిన ట్రాక్టర్లలో పాలేరు వాగు నుంచి అనుమతులు లేకండా ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం మేరకు రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేయడంతో పాటు ఉపేందర్, గణేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ గురువారం తెలిపారు.

ఘనంగా లింగమంతుల జాతర



కేసముద్రం: పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంవిలేజ్‌లో శ్రీలింగమంతుల జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్, ఉమా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ స్టేట్ వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్నయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారంలో కొలువైన ఉన్న యాదవుల ఆరాధ్య దైవమైన లింగమంతుల స్వామి జాతరకు ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ సతీమణి ఉమ స్థానిక నాయకులతో కలిసి గురువారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బడిలో.. చిన్నారులతో పనులు!



సిమెంట్ ఇటుకలు మోస్తున్న విద్యార్థులు

కేసముద్రం: బడిలో పలక, బలపం పట్టించి చదువు నేర్పించాల్సిన కొందరు టీచర్లు.. ఆ పిల్లల చిట్టిచేతులతో సిమెంట్ ఇటుకలను మోపించిన సంఘటన కేసముద్రంస్టేషన్ ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రంస్టేషన్ ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు టీచర్లు ఉండగా, 65 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ క్రమంలో పాఠశాలలో గురువారం విద్యార్థులు సిమెంట్ ఇటుకలు మోస్తున్న వీడియో బయటకు వచ్చింది. దీంతో పిల్లలచే బరువులు మోపిస్తూ, పనులు చేపిస్తున్నారనే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం దేవ్‌సింగ్‌ను వివరణ కోరగా, తాము విద్యార్థులతో పని చేయించలేదని, టీచర్లే సిమెంట్ ఇటుకలు మోసి, మెట్లుగా ఏర్పాటు చేశారని తెలిపారు.

బాధితులకు సాయం

మరిపెడ రూరల్: మండలంలోని సీతారంతండా, ఉల్లెపల్లి, బాల్నిధర్మారం ముంపు గ్రామాల బాధితులకు వెల్స్ ఫార్గో సహకారంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పునరావస సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్ చంద్ర చేతుల మీదుగా ముంపు బాధితులకు సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మెరుగు భరత్ కుమార్, కందూరి రాములు, సతీష్, సూర్యప్రసాద్ పాల్గొన్నారు.

మిర్చి ధర తగ్గిస్తున్న వ్యాపారులు



మాట్లాడుతున్న చిన్న చంద్రన్న

నెహ్రూసెంటర్: వ్యాపారులు సిండికేట్‌గా మారి మిర్చి ధరను తగ్గించి రైతులకు అన్యాయం చేస్తున్నారని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారులు అధిక లాభాలను ఆర్జించేందుకు సిండికేట్లుగా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. మిర్చి రూ.23వేలు ఉండగా రూ.12వేలకు ఎందుకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారో సమగ్ర విచారణ చేయాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, పూనెం ప్రభాకర్, ముల్కూరు జగ్గన్న, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, పైండ్ల యాకయ్య పాల్గొన్నారు.

అందుబాటులో ఉండని కార్యదర్శి

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) పంచాయతీ కార్యదర్శి రాము కొన్ని రోజులుగా ప్రజలకు అందుబాటులో ఉండడంలేదని గ్రామస్తులు కొత్త ఉపేందర్, మాచర్ల హరీశ్, ఎస్‌కె.రంజాన్, గాండ్ల వినయ్, తురక వెంకటేష్, వేల్పుల సాయిలు గురువారం తెలిపారు. కొద్ది రోజులుగా విధులకు హాజరుకావడం లేదన్నారు. పంచాయతీ కార్యదర్శి మాకొద్దని తెలిపారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి రామును వివరణ కోరగా రాజకీయ ఒత్తిడితోనే తనను ఇబ్బంది పెడుతున్నారని, మానసిక ఇబ్బందికి గురిచేస్తున్నారని తెలిపారు. ఒక ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో వాళ్లు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. విధులకు ఆటంకం కల్పిస్తున్నారని వివరించారు.

సంక్షిప్త సమాచారం

ఎన్నికలకు సహకరించాలి

కురవి: సీరోలు మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ గౌస్ గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీల నాయకులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీదేవి, సత్యనారాయణ, తిరుపతి, దిలీప్ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

మహబూబాబాద్ రూరల్: ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న అన్నారు. ఈనెల 20న జరుగనున్న చలో హైదరాబాద్ పోస్టర్లను బోడగుట్ట తండ గ్రామంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కులీ సంఘం జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పాపయ్య, నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ లీక్.. తప్పిన ప్రమాదం

పెద్దవంగర: ఓ ఇంట్లో గ్యాస్ లీకైన సంఘటనలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండల పరిధిలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని పోచంపల్లి గ్రామంలో వెంకటమ్మ ఇంట్లో ఉన్న గ్యాస్‌ను ఆన్‌చేసి స్టవ్‌పై వంట చేస్తూ తాగునీరు తెచ్చేందుకు బయటకు వెళ్లింది. తిరిగి వచ్చే వరకు గ్యాస్ లీకై మంటల చెలరేగి పొగలు వ్యాపించాయి. అప్రమత్తమైన ఆమె సహసించి గ్యాస్ సిలెండర్‌ను బయటకు తీసుకువచ్చి ఆర్పేసింది. ఇంట్లో ఉన్న నిత్యవసర సరకులు కాలిపోయాయి.

శాంతియుత జీవనం కొనసాగించాలి

మహబూబాబాద్ రూరల్: గ్రామీణ ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా శాంతియుత వాతావరణంలో కలిసిమెలసి ఉండాలని రూరల్ ఎస్సై వి.దీపిక అన్నారు. మండలంలోని వేమునూరు గ్రామంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొబేషనరీ నరేష్, ఏఎస్సై రమేష్, పీసీలు అశోక్ పాల్గొన్నారు.

సాగు నీరందించాలి

నెల్లికుదురు: ఎస్సారెస్పీ కాల్వల ద్వారా చెరువులు, కుంటలు నింపి చివరి ఆయకట్టు సాగు పంటలకు నీరందించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండలంలోని పలు గ్రామాల్లో ఎండిపోతున్న చెరువులు, కుంటలు, పంటలను సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు.

రైలు కింద పడి వృద్ధురాలి మృతి

గార్ల: మండల కేంద్రానికి చెందిన మతిస్థిమితం లేని అంబటి సక్కుబాయి(60) గురువారం ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు కింది పడి మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు సందర్శించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉజ్వల భవిష్యత్

తొర్రూరు: వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల వైద్యాధికారి జ్వలిత అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాటోతు రమేష్, వైస్ ప్రిన్సిపాల్ బి. అశోక్, డైరెక్టర్లు భూక్య శ్రీను, సాగర్ పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలి

కురవి: మండలంలోని రాజోలు గ్రామంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన 40మంది పేదలు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించుకున్నారని, వారికి బిల్లులు చెల్లించాలని సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి నాళం వెంకన్న డిమాండ్ చేశాడు. గురువారం రాజోలు గ్రామంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఒక్కొక్కరికి రూ.80వేల నుంచి రూ.1.40లక్షల వరకు మొదటి విడత బిల్లులు చెల్లించారని తెలిపారు.ఈ సమావేశంలో నాయకులు షేక్ మల్సూర్, మనోహర్, మాధవరావు, వెంకటేశ్వర్లు, అనిల్ పాల్గొన్నారు.

ఒడిస్సీ నృత్య ప్రదర్శన

కేసముద్రం: మండలంలోని పెనుగొండ జెడ్పీ హైస్కూల్‌లో గురువారం స్పిక్ మకే స్వచ్ఛంద సంస్థ, ట్రిబుల్ ఐటీ బాసర, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా భారతీయ సంస్కృతి కళల ప్రచారంలో భాగంగా నిర్వహించిన ఇట్టి కార్యక్రమంలో ప్రముఖ ఒడిస్సి నృత్య కళాకారిణి ప్రగ్యఘోష్ తన నృత్య ప్రదర్శనతో అందర్ని అలరించింది.

సీపీఎంకు రాజీనామా

గార్ల: సీపీఎం పార్టీ సభ్యత్వానికి, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శికి రాజీనామా చేస్తున్నట్లు మాలోత్ శాంతికుమార్ తెలిపారు. గురువారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో గిరిజనులను ఎదగనివ్వకుండా సీపీఎం జిల్లా కార్యదర్శి నియంతృత్వ ధోరణితో వ్యవహరించడంపై గిరిజన లంబాడీలు పార్టీకి దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే నేను సైతం సీపీఎం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

క్రేన్ డబ్బా తెగిపడి ఇద్దరికి తీవ్ర గాయాలు

మరిపెడ రూరల్: వ్యవసాయ బావి పూడిక తీస్తుండగా క్రేన్ డబ్బా తీగ తెగి పడడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని బాల్నిధర్మారం గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని లచ్చతండ గ్రామ పంచాయతీకి చెందిన గుగులోతు వెంకన్న, గుగులోతు లక్ష్మణ్ మండలంలోని బాల్నిధర్మారం శివారు వ్యవసాయ బావి పూడిక తీత తీస్తున్న క్రమంలో ఒక్కసారికి క్రేన్ డబ్బాకు ఉన్న తీగ తెగిపోయింది. డబ్బా బావిలోని సదరు వ్యక్తులపై పడడంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలపై శుక్రవారం సదస్సు నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ వెంకటేష్ గురువారం తెలిపారు. పట్టణంలోని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ కార్యాలయంలో ఉదయం10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు.